# శాంతి, పునరేకీకరణల కోసం పోరాడుతున్న కొరియా ప్రజానీకం

**ఉత్తరకొరియా** అధ్యక్షుడు కిమ్ జాంగ్‌ఉన్ మరియు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ల నడుమ 2018 జూన్ నెలలో జరిగిన సమావేశాన్ని ప్రపంచవ్యాపితంగా అందరూ స్వాగతించారు. కొరియా ద్వీపకల్పంలో శాంతి ప్రక్రియను వేగ వంతంచేసి, యుద్ధరథ చక్రాలను వెనక్కు మలిపే నిర్దిష్టచర్యగా దీనిని చాలామంది పేర్కొన్నారు. ఉత్తరకొరియా నాయకత్వం తనకు తాను రక్షణ కల్పించుకుంటూ గొప్ప సన్నద్ధతతో శాంతికొరకు ప్రయత్నాలను తగిన సమయంలో అందిపుచ్చుకొని దౌత్యపరంగా వ్యవహరించటంవలననే ఆ సమావేశం కార్యరూపం దాల్చింది. కొన్ని కోణాల్లో సమావేశం యొక్క ఫలితాలు ఇంకా స్పష్టంగా లేవు. సమస్యలు, వివాదాలేగాక విచ్ఛిన్నానికి కూడా దీనిలో బీజా లున్నాయి. అయినప్పటికీ, సమస్యలను శాంతియుత పద్ధతుల్లో పరిష్కరించుకునే పద్ధతులపైన దృష్టి పెట్టటానికి, ఊపిరి తీసుకునేందుకు కొంత వ్యవధి నిచ్చింది.

సమావేశం తదనంతర కాలంలో ఉత్తర కొరియా నాయకత్వం చిత్తశుద్ధితో ఆ సమావేశంలో కుదిరిన అవగాహనను ఆచరణలో పెట్టటానికి సంపూర్ణంగా ప్రయత్నించింది. దాని ముందున్న సమస్యలు ఇవి: 1. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితం చేయటం 2. ఉత్తరకొరియా అమెరికాల నడుమ సంతకాలు చేసుకున్న 1953 నాటి యుద్ధ విరామ సంధిని రద్దుచేయటం – ఆవిధంగా వారిరువురి నడుమ యుద్ధ స్థితి ఒక ముగింపు కొస్తుంది. 3. సామ్రాజ్యవాదుల జోక్యం, దురాక్రమణ యుద్ధాలలో కొరియా ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా, బలవంతంగా రెండు దేశాలుగా విభజించబడిన కొరియా ప్రజానీకాన్ని పునరేకీకరించాలి. 4. కొరియా ద్వీపకల్పంలో అమెరికా జోక్యాన్ని నిరోధించటంతోపాటు హిందూ మహాసముద్రాన్ని, హిందూ–పసిఫిక్ ప్రాంతాన్ని ఆధిపత్య రాజకీయాలనుండి బయటపడవేయాలి.

ఉత్తరకొరియా నాయకత్వం తన అణు కర్మాగారాలను మూసివేయటానికి నిర్దిష్ట చర్యలు చేపట్టింది. అది తన ప్రధాన అణ్వస్త్ర కర్మాగార సముదాయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా కూడా 'అందుకు సంబంధిత చర్యలు' చేపట్టినట్లయితే, అంతర్జాతీయ పరిశీలనాబృందం తమ దేశ కర్మాగారాలను పరిశీలించటానికి అనుమతిస్తామని ఉత్తరకొరియా బహిరంగంగా ప్రకటించింది. దీనిలో సందేశమేమంటే, అమెరికా కూడా తన అణ్వస్త్ర కర్మాగారాలను, ఆయుధాలను ధ్వంసం చేయటమో లేదా తొలగించటమో తప్పనిసరిగా చేపట్టాలనేదే. ఏమైనా, అమెరికా దాని ప్రభావంలోని ప్రచార మాధ్యమాలు అణ్వస్త్ర రహితంగా రూపొందటం ఉత్తరకొరియాకు మాత్రమే వర్తించేదిగా భావాలను వ్యాప్తి చేస్తున్నారు. ఇది చాలా కుటిలపూరితమైనది. ఇది కొరియా ద్వీప కల్పంలో అమెరికా అణ్వస్త్రాలతో సాయుధమై వుండగా, ఉత్తరకొరియాను మాత్రమే అణ్వస్త్ర రహితదేశంగా నిరాయుధం చేయటమే. కొరియా ద్వీపకల్పంలో శాంతిని పునరుద్ధరించటంలో ఇది తీవ్ర అవరోధాలను సృష్టిస్తుంది.

1950లో కొరియా ద్వీపకల్పంలో కొరియా వ్యవహారాలలో అమెరికా సామ్రాజ్యవాదులు సైనిక పరంగా జోక్యం చేసుకొని, ఆపై 3 సం॥ల కాలం అక్కడే తిష్టవేసుకొని వున్నారు. 1953లో యుద్ధ విరామసంధిపై సంతకాలు చేసుకున్న తర్వాత ఈ దురాక్రమణ యుద్ధం ముగిసింది. అయితే, దీని ఫలితంగా కొరియా రెండుగా–ఉత్తరకొరియా, దక్షిణ కొరియాగా–విడివడింది. దీనితోపాటుగా దక్షిణ కొరియా అమెరికా ఉపగ్రహ దేశంగా మిగిలి పోయింది. అమెరికా 28,000 మంది సైన్యంతో దక్షిణకొరియాలో దృఢమైన సైనిక స్థావరాన్ని ఏర్పరుచుకుని, అత్యాధునిక ఆయుధాలను కుప్పలు తెప్పలుగా దక్షిణకొరియాలోకి, కొరియా ద్వీపకల్పం లోకి కుమ్మరిస్తూ వచ్చింది. ఇదంతా ఉత్తరకొరియా బారినుండి దక్షిణకొరియాను కాపాడటం పేర చేబట్టింది. కనుక, కొరియా ద్వీపకల్పంలో శాంతి, భద్రతలను కల్పించేందుకు యుద్ధాన్ని విరమించి, దక్షిణకొరియానుండి అమెరికా స్థావరాన్ని ఎత్తి వేయటంతోపాటు, కొరియా ద్వీపకల్పంనుండి అమెరికా ఆయుధాలను, ఆయుధ వ్యవస్థలను తొలగించటంతోనే యుద్ధస్థితికి ముగింపు పలికినట్ల వుతుంది. ఇది కొరియా ప్రజల ప్రముఖమైన డిమాండ్.

1953 నాటి కొరియా విభజన పూర్తిగా అవాంఛనీయం. అమెరికా జోక్యందారీ ఆధిపత్య రాజకీయాలు బలవంతంగా ప్రజలపై ఈ విభజనను రుద్దాయి. రెండువైపులా ప్రజానీకానికి విభజన ద్వారా మరిన్ని కష్టాలు, దుఃఖం, బాధలు ఎక్కు వయ్యాయి. కనుక కొరియా ఏకీకరణ కావాలనే ప్రజల ఆకాంక్ష అణచజాలనిది. యావత్ కొరియా ద్వీపకల్పంలో శాంతిభద్రతల పునరుద్ధరణతో కొరియా ఏకీకరణ అవిభాజ్యంగా ముడిపడివుంది.

ఉత్తర, దక్షిణకొరియా దేశాల పాలకులు చాలాకాలంగా చర్చలకు ఒక శాంతియుత అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఒలంపిక్ క్రీడల సందర్భంగా రెండు దేశాల క్రీడాకారులూ ఒకే బృందంగా పాల్గొంటారనే కిమ్ యొక్క దౌత్య చొరవ ఈ ప్రయత్నాలకు మరింత వూపునిచ్చింది. 2018 జూన్ సమావేశం తర్వాత ఇరుదేశాల నాయకుల నడుమ సంబంధాలు, పరస్పర పలకరింపులు, చర్చలు మరింత మెరుగయ్యాయి. వారు పరస్పర సందర్శనలు, చర్చలతోపాటు కొన్ని ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారు.

2018 సెప్టెంబర్ మూడవ వారంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ ఉత్తరకొరియాను సందర్శించాడు. మూన్, కిమ్‌లు వారివారి జీవిత భాగస్వాములతో 2744 మీటర్ల ఎత్తైన పీక్‌టు శిఖరాన్ని సందర్శించారు. మొట్టమొదటి కొరియా సామ్రాజ్య

చారిత్రక స్థాపకుడు అయిన డాన్‌గమ్ జన్మస్థలమది. రెండు దేశాలలోని కుటుంబాల పునరేకీకరణకు, రెండు దేశాలను కలిపే రోడ్డు, రైలు మార్గాల నిర్మాణంతో శాశ్వత సౌకర్యం కల్పించేందుకు, 2032లో ఒలంపిక్స్ నిర్వహణకు సంయుక్తంగా టెండర్ వేయటానికి ఇరుదేశాల నాయకులు అంగీకారానికొచ్చారు. ఉత్తరకొరియాకు చెందిన 'జన క్రీడలు' ప్రచార రూపకం ప్రదర్శనలో మూన్ మాట్లాడుతూ కొరియా ఏవిధంగా 5 వేల సం॥ల కాలం కలిసివుందో గుర్తు చేసుకున్నాడు. కొరియా ద్వీపకల్పాన్ని 'అణ్వస్త్రాలు, అణ్వాయుధ బెదిరింపులు లేని శాంతిభూమి'గా మారుస్తామని ఇరువురు నాయకులు ఓ సంయుక్త విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఉత్తరకొరియా తన ప్రధాన అణ్వస్త్ర కర్మాగార సముదాయాన్ని మూసివేయడానికి సిద్ధంగా వుందని, అయితే దీని కనుగుణమైన చర్యలు అమెరికా కూడా చేపట్టాలని కిమ్ ప్రకటించాడు. సమీప భవిష్యత్తులో తాను దక్షిణకొరియా సందర్శిస్తానని ఆయన చెప్పాడు. పునరేకీకరణను కోరుతున్న యావత్ కొరియా ప్రజానీకాన్ని వీరి చర్యలు, ప్రకటనలు స్పందింపజేశాయి; వారి భావోద్వేగాలకు, ఆకాంక్షలకు అద్దం పట్టాయి.

అయితే, కొరియా ద్వీపకల్పంలోనూ అదే విధంగా హిందూ మహాసముద్రంలోనూ మరియు ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సామ్రాజ్యవాదులు ప్రత్యేకించి అమెరికా చెలాయిస్తున్న ఆధిపత్యం, జోక్యందారీ రాజకీయాలు కొరియా సమస్య పరిష్కారానికి ప్రధాన అవరోధంగా వున్నాయి. కనుక, సామ్రాజ్యవాదుల ఆధిపత్యం, జోక్యం నుండి కొరియాను బయటపడేసేందుకు, శాంతి భద్రతలను స్థాపించేందుకు, కొరియా ప్రజల చిరకాల వాంఛ అయిన కొరియా పునరేకీకరణను నిజం చేసేందుకు కొరియా ప్రజలు దీర్ఘకాల, కష్టతరమైన పోరాటాన్ని సాగించాల్సి వుంది.

ooooo